క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం వద్ద నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: అక్షయ తృతీయ సందర్భంగా నగరంలోని చౌక్‌బజారు వద్ద బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఇబ్బందులు పడకుండా, వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు టాటా గ్లూకోజ్‌ను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గరిమెళ్ల విజయ్‌కుమార్, నారాయణశెట్టి వెంకటకిరణ్‌కుమార్, శిల్లా లక్ష్మినారాయణ, గెంబలి రమేష్, మనబాల వెంకట అనంతరవి కిల్లంశెట్టి వాసుదేవరావు, వైశ్యరాజు మహేష్‌రాజు, సత్యవరపు త్రినాధమూర్తి, నేమాని కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లలితాదేవికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

ఎచ్చెర్ల: దోమాం పంచాయతీ కుంచాలకుర్మయ్యపేటలో లలితాదేవి అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. అర్చకులు వంశీకుమార్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నర్సింగరెడ్డి, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కూర్మనాథుని కల్యాణానికి పందిరిరాట



పందిరిరాట వేస్తున్న అర్చక బృందం

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథుని కల్యాణోత్సవానికి బుధవారం శాస్త్రోక్తంగా పందిరాట వేశారు. గర్భగుడి పక్కన ఉదయం ప్రత్యేక పూజలనంతరం ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు రాట వేశారు. ఈ నెల 8వ తేదీ రాత్రి వైశాఖ ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామి కల్యాణోత్సవం జరగనుంది. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.నరసింహానాయుడు, స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, కిషోర్‌బాబు, దాసుబాబు, శ్రీనివాసాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.


ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేం సమీపంలోని శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ మెకానికల్ చివరి ఏడాది విద్యార్థులు విభాగాధిపతి డాక్టర్ లక్ష్మణరాజు ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ వాహనం రూపొందించారు. ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా పాత పెట్రోల్ వాహనాన్ని ఎలక్ట్రిక్ వాహనంగా తీర్చిదిద్దారు. బ్యాటరీ, మోటార్ ఏర్పాటు చేశారు. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 70 కిలోమీటర్ల వేగంతో 80 కిలోమీటర్లు ప్రయాణం చేస్తుందని, 10 మంది ప్రయాణికులను తీసుకెళ్లుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను మేనేజ్‌మెంట్ సభ్యులు, బోధనా సిబ్బంది అభినందించారు.

ఆదిత్యుని సన్నిధిలో ఆర్మీ మేజర్ జనరల్



మేజర్ మిశ్రాకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో భద్రాజీ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దేశ భద్రతా విభాగమైన ఆర్మీ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ ఈవో వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు ఆదిత్యుని జ్ఞాపిక అందజేసి ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష.. పంటలకు రక్ష

- మట్టి నమూనా సేకరణకు ఇదే అనువైన సమయం
- రైతు సేవా కేంద్రాల సహాయంతో పరీక్షల నిర్వహణ



పొలం వద్ద భూసార పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల : భూమి సారం తెలియకుండా ఇష్టారాజ్యంగా ఎరువులు వినియోగించడంతో పంట దిగుబడులు రానురాను తగ్గిపోతున్నాయి. భూములు సారవంతం కోల్పోతున్నాయి. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ఎరువులను అధికంగా వాడకుండా ఉండేందుకు, పొలాల్లో భూసారం పెంచేందుకు భూసార పరీక్షలు తప్పనిసరని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. భూసార పరీక్షల వల్ల పొలాల్లో ఏ మేరకు ఎరువులను, సూక్ష్మపోషకాలను వినియోగించుకోవాలో తెలుస్తుందని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని చెబుతున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో అన్ని మండలాల్లో భూసార పరీక్షలు నిర్వహించే దిశగా అధికారులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే సుమారు 3 వేల వరకూ భూసార పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు చెబుతున్నారు.

మట్టి సేకరించాల్సింది ఇలా..

చౌడు, ఆమ్ల నేలల్లో ఇతర ఏ సమస్యాత్మక నేలల్లోనైనా వేరువేరుగా మట్టి నమూనాలు సేకరించాలి. 15–30 సెంటీమీటర్ల లోతులో మట్టి నమూనాలు సేకరించాల్సి ఉంటుంది. ఎటువంటి చెత్త ఉన్నా వాటిని తొలగించి వీ ఆకారంలో గొయ్యి తీసుకోవాలి. ఒకే మందంలో పైనుంచి కిందవరకూ పల్చగా పొర్లగా తీసుకుని మట్టి సేకరించాలి. జిగ్‌జాగ్ పద్ధతిలో ఎకరాకు 8 నుంచి 10 చోట్ల రెండు కిలోల మట్టిని సేకరించాలి. దీనిని గోనెపై వేసుకుని నీడలో ఆరబెట్టి ఏదైనా మట్టి గడ్డలు ఉంటే వాటిని చిదిమేయాలి. తర్వాత నాలుగు భాగాలుగా చేసుకుని ఒక్కో భాగం నుంచి కొంతమట్టిని తీసుకుని కిలో మట్టిని తయారుచేసి నమూనాకు తీసుకోవాలి. వేసే పంటను బట్టి నమూనా సేకరణ మారుతుంది. స్వల్పకాలిక పంటలకు 15/20 సెంటీమీటర్ల లోతు తీయాలి. తోట పంటలకు 3/4 అడుగులు తీయాలి.

పోషక లోపాలను గుర్తించాలి

మట్టి నమూనా పరీక్షలు చేసిన తర్వాత భూసార పరీక్షా ఫలితం ఆధారంగా స్థూల, సూక్ష్మ పోషకాల విలువను తెలియజేస్తూ వాటి ఆధారంగా రైతులకు సిఫారసు చేస్తారు. ప్రతిరైతు సాగు చేసే పంటల్లో స్థూల, సూక్ష్మ పోషకాలు లోపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. స్థూల, సూక్ష్మ పోషకాలుగా పిలవబడే నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్, బోరాన్, సల్ఫర్, కాల్షియం, మెగ్నీషియం, జిప్సమ్‌లు పంటల్లో లోపిస్తే దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. ఈ లోపాన్ని గుర్తించి సకాలంలో వాటిని వేసుకుని దిగుబడిని పెంచుకోవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పోషకాల లోపాలను నివారించడానికి జిప్సమ్, జింక్, పచ్చిరొట్ట ఎరువలను సాగులో తీసుకురావాలి. ప్రతి రైతు తమ పొలాల్లో స్థూల, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి అందుకు అనుగుణంగా తగు చర్యలు తీసుకోవడం మంచిదని అధికారులు చెబుతున్నారు.

ఆ మట్టి వద్దు..

భూసార పరీక్షలకు సంబంధించి పొలం గట్టు పక్కన మట్టిని తీయకూడదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. నీటి ముంపు, చెట్ల నీడ, చెట్ల వేర్లు ఉన్న చోట కూడా మట్టి నమూనా తీయకూడదు. సేంద్రియ వ్యవసాయానికి ఎరువులు వేసిన తర్వాత కూడా నమూనాలు సేకరించకూడదు. సేంద్రియ, రసాయనిక ఎరువులు వేసిన 50 రోజుల తర్వాత మట్టి నమూనాలను సేకరిస్తేనే ఫలితాలు పక్కాగా వస్తాయి.



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

తప్పనిసరి..



మట్టి నమూనాల సేకరణకు అనువైన సమయం ఇదే. రైతు సేవా కేంద్రాల సహాయంతో భూసార పరీక్షలు చేయిస్తున్నాం. భూసార పరీక్షలను అనువైన మట్టి నమూనాను మాత్రమే సేకరించాలి. భూసారాన్ని గుర్తించి వాటికి అనుగుణంగా ఉండే ఎరువుల వాడకంపై సూచనలు ఇస్తున్నాం. భూసారం పెరగడం వల్ల ఎరువులు వాడకం, ఖర్చు తగ్గుతాయి.

– మహేష్ నాయుడు, లావేరు వ్యవసాయాధికారి

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈవో డి.సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా బుధవారం శ్రీకాకుళం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సహకార సంవత్సరంగా నిర్ణయించారని, ఇందులో భాగంగా ప్రతి నెలా సేవా కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలో రక్తం నిల్వలు రోజురోజుకూ తరిగిపోతున్న నేపథ్యంలో బ్లడ్‌బ్యాంకులో రక్తనిల్వలు పెంచేందుకు తమవంతుగా డీసీసీబీ ఉద్యోగులు, సహకార సంఘ ఉద్యోగులు, అధికారులతో కలిసి రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, ప్రతినిధులు పి.చైతన్య, సత్యనారాయణ, బి.చిన్నయరావు, నంది ఉమాశంకర్, సిబ్బంది, డీసీసీబీ బ్యాంక్ జీఎంలు డి.వరప్రసాద్, ఎస్‌వీఎస్ జగదీష్, డీజీఎంలు ఎస్.రమేష్, సీహెచ్.బసవలింగం, ఎస్‌వి సత్యనారాయణ, జి.సునీల్, ఏజీఎంలు ఆర్‌కె భాస్కరరావు, వి.దశరథరాం, రామకృష్ణారావు, బాబ్జి, మేనేజర్‌లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో దళితులకు మొండిచేయి



ముంజేటి కృష్ణమూర్తి

గార: కూటమి ప్రభుత్వం ప్రకటించిన డీసీఎంఎస్, డీసీసీబీ నామినేట్ పోస్టుల్లో దళిత సామాజికవర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి అన్నారు. బుధవారం గారలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో ఓట్లు వేయించుకోవడానికే ఎస్సీ, ఎస్టీలను వాడుకుంటారని, సామాజికపరంగా దళితులను ఎప్పుడూ అణగదొక్కడానికే చూస్తున్నారని దుయ్యబట్టారు. జగన్ మోహనరెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రంలో ఏ నామినేట్ పోస్టులు ప్రకటించినా తప్పనిసరిగా దళితులకు ప్రాధాన్యముండేదన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో దళితులను గ్రామ బహిష్కరణ చేయడం సిగ్గుచేటన్నారు. తెలుగుదేశం నాయకుల బినామీలకే ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందుతున్నాయని, టీడీపీ మద్దతుదారుల్లో ఒకరిద్దరికి మాత్రమే అర్హులుగా చూపి నాయకులు జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు.

మహిళలు స్వయం ఉపాధి సాధించాలి



లావేరులో కుట్టుమిషన్ శిక్షణను పరిశీలిస్తున్న ఈడీ గడ్డెమ్మ

ఎచ్చెర్ల/రణస్థలం: బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టుమిషన్ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ అన్నారు. బుధవారం లావేరులోని వెలుగు కార్యాలయం సమావేశం మందిరంలో కుట్టు మిషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తప్పనిసరిగా 75 శాతం ఉంటేనే ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామన్నారు. రోజుకు రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సూపరింటెంటెండ్ సునీత, ఏపీవో సుబ్బయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రణస్థలం మండల కేంద్రంలో జరుగుతున్న టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను పెంపుదల సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఫోరం ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ : రాష్ట్రంలో ఆస్తి పన్ను ఏటా 15 శాతం పెంపుదల చేసే విధానంతో మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతారని ఏపీ ఇంటెలెక్చువల్స్ ఫోరం (ఏపీ ఐఎఫ్) ప్రతినిధులు ఆవేదన వ్యక్తంచేశారు. ఆస్తి పన్ను ఏటా పెంపుదలను నిలిపివేసేలా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఫోరం ప్రతినిధులు బలివాడ మల్లేశ్వరరావు, సురంగి మోహనరావు, కోనే శ్రీధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం శ్రీకాకుళం న్యూ కాలనీలోని ఫోరం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి సామాజిక, సేవా కార్యక్రమాలతోపాటు నిరుద్యోగులకు ఉపయోగపడేలా ముమ్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు డబ్బీరు గోవిందరావు, పూడి జనార్దనరావు, పుక్కళ్ల లక్ష్మణరావు, దొంతం పార్వతీశం, కనుగుల సత్యం, ఎం.వి.మల్లేశ్వరరావు, రొంపివలస రామారావు, ఉపేంద్ర శర్మ, ఎస్.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికే మెప్మా బజార్లు



మెప్మా బజార్‌ను పరిశీలిస్తున్న జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు నాగలక్ష్మి

శ్రీకాకుళం: స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం మెప్మా బజార్లు నిర్వహిస్తోందని జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు బలగ నాగలక్ష్మి అన్నారు. బుధవారం రైతుబజార్ వద్ద మెప్మా అర్బన్ మార్కెట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ సంఘ మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌలభ్యం కల్పించడం ద్వారా స్థిర ఆదాయం లభిస్తుందన్నారు. ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే సీఎం ఆశయమన్నారు. కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్ ఎస్.వెంకటరావు, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.


ఘనంగా వీరభద్రస్వామి కల్యాణోత్సవం



భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని నక్కవీధిలో వీరభద్రస్వామి ఆలయం 12వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. కార్యక్రమంలో అర్చకులు మహేష్, అశ్వినికుమార్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


వైభవంగా మహా కుంభాభిషేకం ఉత్సవం



అయ్యప్ప ఆలయంలో భక్తులు

శ్రీకాకుళం కల్చరల్ : బలగ అయ్యప్ప స్వామి ఆలయంలో మహా కుంభాభిషేక విమాన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. మూడురోజులుగా జరుగుతున్న ఈ వేడుకల్లో భాగంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శబరిమల మెయిల్ శాంతి ఎస్‌ఎం రాజేష్, నంబుద్రి, ఆలయ అర్చకులు దేవరకొండ శంకర్ నారాయణ ఆధ్వర్యంలో తిరుమంజనం మహా పూర్ణాహుతితో కార్యక్రమాలు ముగిశాయి.

4 నుంచి మహాయజ్ఞ పూర్ణాహుతి



హాజరైన భక్త ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీరామనామ దశకోటి మహాయజ్ఞం, హనుమాన్ చాలీసా కోటి పారాయణ పూర్ణాహుతి కార్యక్రమాలు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహిస్తామని నగరంలోని ఉపనిషన్మందిరం ప్రతినిధులు తెలిపారు. బుధవారం టీటీడీ కల్యాణ మండపంలో సామూహిక హనుమాన్ పారాయణ చేశారు. చివరి రోజున రామకోటి లేఖనాలతో శోభాయాత్ర నిర్వహిస్తామని, భక్తులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మందిరం ప్రతినిధులు, శ్రీరామ భక్త ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డుపై నీరు..డ్రైవర్ల బేజారు



కింతలిమిల్లు సమీపంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై కొద్దిపాటి వర్షమొచ్చినా నీరు నిలిచిపోతోంది. మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు సైతం పాడైపోతోంది. –ఎచ్చెర్ల క్యాంపస్

రోడ్డు ఇలా..రాకపోకలు ఎలా?



నగరంలోని ఇల్లీసుపురం రైతు బజారు కూడలి వద్ద ప్రధాన రోడ్డు అధ్వానంగా మారింది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ అధికంగా ఉండటంతో ఈ ప్రాంతంలో వాహనదారులు బండి నడిపేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు గోతులమయం కావడంతో ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. – శ్రీకాకుళం అర్బన్

వైభవంగా కర్ణమాంబ ప్రతిష్ఠాపన



గార మండలం శిమ్మపేట గ్రామదేవత కర్ణమాంబ (చెవిటమ్మ) ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, వృక్ష సహిత పాదుకా స్థాపన శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు దార్లపూడి కామేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆరవెల్లి భాలభాస్కరశర్మ వైదిక బృందం ముందుగా నేత్రోన్మీలనం, కుంభ, ధేను దర్శనం, నిజరూప దర్శనం, పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. – గార

గురుకులాల్లో మెరుగైన విద్య అందించాలి



సంజీవ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న దళిత జేఏసీ నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎచ్చెర్ల అంబేడ్కర్ గురుకులం/ జూనియర్ కళాశాలకు వచ్చిన అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ ఎస్.సంజీవ్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది నియామకాలు చేపట్టాలని, పక్కా భవనాలు నిర్మించాలని, శిథిల భవనాలకు మరమ్మతులు చేపట్టాలని, డిగ్రీ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని, పారామెడికల్, ఉపాధికి ఉపయోగపడే కోర్సులు ప్రారంభించాలని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా డైట్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, సోలార్ విద్యుత్ సరఫరా వ్యవస్థ ఏర్పాటు చేయాలని, కొత్త గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు దుర్గాసి గణేష్, మిస్కా కృష్ణయ్య, యడ్ల గోపి, కళ్లేపల్లి రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



పాటలు పాడుతున్న విద్యార్థినులు

శ్రీకాకుళం అర్బన్: వేసవి శిక్షణా శిబిరాలను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉప గ్రంథాలయ అధికారి వి.వి.జి.శంకరరావు కోరారు. వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాయ కార్యదర్శి బి.కుమారరాజ్, ఉప గ్రంథ పాలకులు శంకరరావు, గ్రంథాలయ గ్రేడ్–3 అధికారి భాస్కరరావు విచ్చేసి పిల్లలకు అభినందనలు తెలిపారు. పాటలు, చిత్రలేఖనం, డ్యాన్స్, ఆటల పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గాయకులు దాత్రి, దేవి, కోమలి, నీలిమ, స్నేహాంజలి, నందిని, లోకేష్ సాయి, తనుశ్రీ, యువరాజ్ పాటలు పాడి ఉత్సాహం పెంచారు. జిల్లా గ్రంథాలయ సిబ్బంది మోహన్, వరలక్ష్మి, సీహెచ్ శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అరుణకుమారికి బెస్ట్ టీచర్ అవార్డు



అవార్డుతో అరుణకుమారి

జి.సిగడాం: మండలంలోని అద్వాన్నంపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ కూర్మాన అరుణకుమారి నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్నారు. బుధవారం విశాఖలోని లైబ్రరీ హాలులో జరిగిన కార్యక్రమంలో మీనకేతన్ దాస్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. విద్యాలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడంతో అవార్డు లభించిందని అరుణకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సంఘాలు, సిబ్బంది అభినందించారు.

విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షాలు, గాలుల కారణంగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడటం, కొన్ని చోట్ల తీగలు తెగిపోవటం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మతులు నిర్వహించారు.